క్లుప్తంగా

నేడు రత్నగిరిపై సరస్వతీ పూజ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో గురువారం సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు సత్యకలములు, కంకణాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అన్నవరం, పరిసర గ్రామాల విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆవరణలో గురువారం రోటరీ, రోటరాక్ట్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో స్థానిక ఏరియా ఆసుపత్రి, మదర్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్తం సేకరిస్తారన్నారు. పెద్దఎత్తున పట్టణ ప్రజలు, రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు వర్మ కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: పాయకరావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె. రత్నాలరావు బుధవారం తెలిపారు. తుని పట్టణం, తుని రూరల్, తొండంగి, కోటనందూరు మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



బొద్దవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో విశ్వమానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిచారు. సంస్థ వైద్యుడు సత్యనారాయణ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా మూడో బుధవారం నిర్వహించే హోమియో వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



ములగపూడి అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ

రౌతులపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలు నిబద్ధతతో పని చేయాలని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ సూచించారు. మండలంలోని ములగపూడి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు హాజరు, సిబ్బంది పనితీరు, పౌష్టికాహార నిల్వలు, గర్భిణులు, బాలింతులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఐసీడీఎస్ విస్తరణాధికారి జానకీలక్ష్మిని ఆరా తీశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించి మెరుగైన ఆరోగ్యానికి తోడ్పడాలని సూచించారు. ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేసి రక్తహీనతను నిరోధించాలని సూచించారు. కార్యక్రమంలో శంఖవరం సీడీపీఓ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



తంటికొండలో వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం

గోకవరం: మండలంలోని తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం రాత్రి స్వామివారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో బద్దిరెడ్డివారి చెరువులో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక, భజన, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

చెరకు సాగు... కనుమరుగు

- మెట్టలో మచ్చుకైనా కనిపించని చెరకు పంట
- మూతపడిన తాండవ సుగర్ ఫ్యాక్టరీ
- సాగుపై ఆసక్తి చూపని రైతులు



కాకరాపల్లిలో సాగు చేసిన చెరకు (ఫైల్)

కోటనందూరు: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో చెరకు సాగు ప్రస్తుతం కనుమరుగైంది. తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఒకప్పుడు ఎక్కడ చూసినా చెరకే దర్శనమిచ్చేది. సీజన్ వచ్చిందంటే చెరకు బళ్లతో మెట్ట ప్రాంతమంతా కళకళలాడేది. అలాంటి చెరకు సాగు ఇప్పుడు మచ్చుకు కూడా కనబడడం లేదు. దేవుడికి నైవేద్యంగా చెరకుముక్క పెట్టాలన్నా దొరికే పరిస్థితి లేదు. ఈ దుస్థితికి గత పాలకుల స్వార్థపూరిత విధానాలే కారణం. రైతు ప్రయోజనాలను పూర్తిగా మరిచిపోయి ఫ్యాక్టరీని నిలువు దోపిడి చేశారు. ఫలితంగా ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి దిగజారి చివరకు మూత పడింది. రైతులకు ఖరీఫ్‌లో వరి పంట తరువాత మరో పంట పండించుకునే అవకాశం లేకుండా పోయింది. ఎంతో లాభదాయకంగా ఉండే చెరకు సాగును ప్రభుత్వం ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

ఐదు దశాబ్దాల క్రితం...

ఐదు దశాబ్దాల క్రితం తుని, పాయకరావుపేట సరిహద్దు ప్రాంతంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ ఫ్యాక్టరీ తుని, ప్రత్తిపాడు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఈ కర్మాగారంలో 13 వేల మంది షేర్ హోల్డర్లు ఉండగా 650 మంది కార్మికులు పని చేసేవారు. ఫ్యాక్టరీ నెలకొల్పిన తొలినాళ్లలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరకూ క్రషింగ్ జరిగేది. కాల క్రమంలో క్రషింగ్ సామర్థ్యం వేల టన్నులకు దిగజారింది. ఆ తరువాత పరిస్థితి మరింత క్షీణిస్తూ చివరకు క్రషింగ్ చేయలేని దయనీయ పరిస్థితికి చేరింది.

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా...

రెండు దశాబ్దాలుగా తాండవ చక్కెర కర్మాగారం నిర్వహణ రాజకీయ నేతల చేతుల్లోకి వెళ్లడంతో క్రమంగా ఫ్యాక్టరీ పరిస్థితి మసకబారుతూ వచ్చి దశాబ్దం క్రితానికి దివాళా తీసే స్థాయికి చేరింది. గత పాలకులు కర్మాగారానికి కనీసం మరమ్మతులు కూడా చేయకుండా క్రషింగ్‌ను ఇబ్బందికరంగా మార్చారు. దొరికినంత దోచేసి చివరకు ఫ్యాక్టరీని దివాళా తీసే స్థితికి దిగజార్చారు.

21 కోట్ల బకాయిల చెల్లింపు

గతంలో ఫ్యాక్టరీకి చెరకు తోలిన రైతులకు రూ.11 కోట్ల వరకూ బకాయిలు ఉండేవి. ఫ్యాక్టరీలో పని చేస్తున్న 650 మంది కార్మికులకు జీతాల రూపంలో మరో రూ.10 కోట్ల బకాయి వెరసి రూ.21 కోట్ల ఆర్థిక భారం ఫ్యాక్టరీపై పడింది. రైతుల విజ్ఞప్తి మేరకు మంత్రి దాడిశెట్టి రాజా కృషితో ఏడాది క్రితం రైతుల బకాయిలను పూర్తిగా చెల్లించారు. కార్మికుల జీతాలను సైతం చెల్లించి ఊరట కల్పించారు. ఫ్యాక్టరీని అందుబాటులోకి తీసుకురావాలంటే సుమారు రూ.50 కోట్లు అవసరం. ఫ్యాక్టరీని తిరిగి తెరిచేందుకు, చెరకు సాగును ప్రోత్సహించేందుకు మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో కృషి జరుగుతోంది.

బకాయిలు చెల్లించారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రైతుల బకాయిలు పూర్తిగా చెల్లించారు. గతంలో ఫ్యాక్టరీ ఒక పద్ధతి ప్రకారం నడవకపోవడంతో మూత పడింది. వరిసాగుతో రైతుకు పెద్దగా ప్రయోజనం ఉండదు. రబీలో అపరాల సాగు కూడా దైవాదీనంగా మారింది. ఈ తరుణంలో అన్నివిధాలా లాభదాయకంగా ఉండే చెరకు సాగును ప్రోత్సహించాలి. ఫ్యాక్టరీని తిరిగి తెరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– రామసూర్యసత్యనారాయణ, చెరకు రైతు, బొద్దవరం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



గజ్జనపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి సూచించారు. మండలంలోని గజ్జనపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించి, నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.రాజబాబు, జెడ్పీహెచ్ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ బర్ల లోవరాజు, సీఆర్పీ రాంజీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- బవురువాక, దోపర్తి, తాడువాయి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



బవురువాకలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు కోరారు. మండలంలోని బవురువాక, దోపర్తి, తాడువాయి గ్రామాల్లో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ అమరాది కాశీ, పార్టీ నాయకులు గెడ్డం వెంకటరమణ, చేశెట్టి కోదండ, బుర్రా కృష్ణ, కంచుకోట్ల లక్ష్మి, పసగడుగుల సత్తిబాబు, జలుమూరి నాగేశ్వరరావు తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శంఖవరం, ప్రత్తిపాడు ఎంపీపీలు పర్వత రాజబాబు, గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశీ చిట్టిబాబు, సొసైటీ చైర్మన్ దోశీ హరిబాబు, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీలు పిల్లా చిన్నా, మొల్లి వీరబాబు, సీంద్రపు భాస్కరరావు, తటవర్తి రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- మామిడాడలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని మామిడాడలో ఉప సర్పంచ్ శరకణం అచ్చిరాజు, వేగి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో భాగంగా 125 సార్లు బటన్‌నొక్కి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. భవిషత్‌తో ఈ పథకాలు నిరాటకంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. భవిషత్‌లో ఏలేరు కుడి కాలువను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువనాయకుడు తోట రాంజీ, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు పెద్దాడ రాజుబాబు, పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, నేత తుల రాము తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల
- ఏలేశ్వరంలో బూత్ కన్వీనర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 'ఎస్' కన్వెన్షన్ హాలులో బుధవారం గ్రామస్థాయి బూత్ కమిటీ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి పార్టీని ముందుకు నడిపించే బాధ్యత కన్వీనర్లదేనన్నారు. అన్ని సర్వేల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని తెలియడంతో ప్రతిపక్షాలన్నీ ఏకమతున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్ని పార్టీలు కలిసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేవన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపులో బూత్ కన్వీనర్ల పాత్ర కీలకమన్నారు. బూత్ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, అడపా పార్థసారథి, ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, నరాల శ్రీను, దోశీ చిట్టిబాబు, ఓలేటి చంటిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

శంఖవరం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి కోరారు. శంఖవరం అంబెడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై కిషోర్ బాబు, పులి సుధాకర్, గునపర్తి అపురూప్, బత్తిన తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు



తూర్పులక్ష్మీపురంలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు మండలంలోని తూర్పులక్ష్మీపురంలో బుధవారం బీజేపీ ప్రజాపోరు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా మహిళలకు 7 రోజుల పాటు శిక్షణ ఇచ్చి రూ.15 వేలు ఇస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, మండల కన్వీనర్ కురాకుల రాజా, జిల్లా సభ్యుడు గట్టెం వెంకటరమణ, వెలుగూరి హరేరామ్, ఏనుగు ధర్మరాజు పాల్గొన్నారు.

రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలి

- జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు



తేటగుంట ఆయిల్ పామ్ తోటలో అంతర పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

తుని రూరల్: ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నేతల మల్లికార్జునరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కోటనందూరు, తుని, తొండంగి మండలాల్లో పని చేస్తున్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఓ గుత్తుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్, కొబ్బరి తోటల విస్తరణ, పునరుద్ధరణ, ఉద్యాన పంటల్లో అంతర పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఆయా పంటలకు ప్రభుత్వం అందించే రాయితీలను రైతులకు తెలియజేయాలన్నారు. ఉద్యాన పంటల విస్తరణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ-క్రాప్ బుకింగ్ విధివిధానాలను వివరించారు. గ్రామాల వారీగా తోటల విస్తీర్ణాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుని మండలం తేటగుంట, తొండంగి మండలం బెండపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయిల్‌పామ్, కొబ్బరి, అంతర పంటలను పరిశీలించారు. మామిడి తోటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రుచి సోయా సంస్థ సిబ్బంది, మూడు మండలాల వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

వేదపండితుడు ముష్టి పురుషోత్తానికి సత్కారం



వేదపండితుడు ముష్టి పురుషోత్తంను సత్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

అన్నవరం: విశాఖపట్నంలోని శ్రీశారదా పీఠంలో బుధవారం నిర్వహించిన పీఠం వార్షిక వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హజరయ్యారు. వేద పండిత సత్కారంలో భాగంగా అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వేద పండితుడు ముష్టి పురుషోత్తంను ఆయన ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, నగదు పారితోషకంతో సీఎం సన్మానించారు. శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి ప్రియశిష్యుడు, ఉత్తరాధికారి సాత్మానందేంద్ర సరస్వతీ స్వామికి అత్యంత సన్నిహితుడైన పురుషోత్తం శ్రీశారదా పీఠంలో నిర్వహించే అన్ని వైదిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశారదా పీఠంలో స్వామీజీల సమక్షంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో సత్కారం పొందడం తన పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వ్రతపురోహిత సంఘం మాజీ అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ, పలువురు పురోహితులు పాల్గొన్నారు.

వలంటీర్లతో దళారీ వ్యవస్థకు చెక్



జగ్గంపేటలో వలంటీర్లను సత్కరించిన ఒమ్మి రఘురాం, తదితరులు

జగ్గంపేట: గ్రామ వలంటీర్ వ్యవస్థతో దళారీ వ్యవస్థకు చెక్ పడిందని కాకినాడ జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక సచివాలయం-4లో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా రత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, దళారి వ్యవస్థ కారణంగా నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందలేదన్నారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థతో అర్హత గల ప్రతిఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారుల తలపుతట్టి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజు, రెడ్డి బానుప్రతాప్, పెద్దాడ రాజబాబు, రామకుర్తి జగాలు, భూమాడ గణపతి, కీలపర్తి వీరబాబు, నీలపల్లి అప్పారావు, దత్తి శ్రీను, పచ్చిపులుసు వీరబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, ఈఓపీఆర్డీ కొండలరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి భూమిపూజ



కోదాడలో సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్, నాయకులు

తొండంగి: మండలంలోని కోదాడ పంచాయతీలో బుధవారం సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు భూమిపూజ చేశారు. కోదాడ, కొత్త కోదాడ, కోదాడ కాలనీ గ్రామాల్లో దీర్ఘకాలంగా రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మండల పరిషత్, పంచాయతీ నిధులు సుమారు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో నిర్మించే డ్రైన్లు, రోడ్లకు వారు శంకుస్థాపన చేశారు. పార్టీ నాయకులు దడాల విజయ్‌బాబు, బూర్తి నాని, అంగులూరి సుశీలరాణి, మండల కన్వీనర్ బద్ది నూకరాజు, సర్పంచ్ బూర్తి రత్నకుమారి, ఉపసర్పంచ్ బద్ది బుజ్జి పాల్గొన్నారు.

రైతులకు సూక్ష్మధాతు మందు పంపిణీ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో మినుము పంట సాగు చేస్తున్న రైతులకు ఫ్లవర్ వండర్ సూక్ష్మధాతు మందును బుధవారం వ్యవసాయ కమిటీ చైర్మన్ రామదాసు పంపిణీ చేశారు. పందిరిమామిడిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రవీణ్ తాళ్లూరులో మినుము పంటలను పరిశీలించారు. మినుము దిగుబడిని పెంచేందుకుగాను రైతులకు సూక్ష్మదాతు మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ ఎ.సద్గురుమూర్తి, వ్యవసాయ సిబ్బంది పృధ్వి, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి


ప్రత్తిపాడు రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి సూచించారు. మండలంలోని గజ్జనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థి దశ నుంచే సన్మార్గంలో నడిచి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిఒక్కరూ మంచి మార్కులను సాధించాలన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఎస్సై పవన్‌కుమార్, ఎంఈఓ రాజబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ సుబ్బలక్ష్మి, పాఠశాల పీఎంసీ చైర్మన్ బర్ల లోవరాజు, సీఆర్పీ రాంజీ ప్రసాద్, హెచ్ఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

విద్యార్థులు ఐక్యతతో మెలగాలి

జగ్గంపేట: విద్యార్థులు ఐక్యతతో మెలగాలని స్థానిక సీఐ ఎస్.లక్ష్మణరావు సూచించారు. మండలంలోని కాట్రావులపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులతో క్రమశిక్షణ కలిగి, ఎటువంటి కక్షలకు పోకుండా సద్భావనతో మెలగాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుపై శ్రద్ధ కనబరిచి భవిష్యత్‌లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గండేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు బుధవారం గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. బాలికలు బ్యాడ్ టచ్‌ను ఎదుర్కొంటే తక్షణమే పాఠశాల ఉపాధ్యాయులకు గాని, తల్లితండ్రులకు గాని తెలియజేయాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కత్తిపూడి హైస్కూల్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

శంఖవరం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కత్తిపూడి సీతారామా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అక్కారావు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం సీతారామ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, గ్రామంలో వ్యర్థాలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ఆవరణను చీపుర్లతో శుభ్రం చేశారు.

గోవులకు వ్యాధి నిరోధక టీకాలు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం గోశాలలోని 190 గోవులకు వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నట్లు గోశాల సూపరింటిండెంట్ ఐవీ రామారావు బుధవారం తెలిపారు. ఇటీవల ఆవులకు ×లంపీ׃ చర్మ వ్యాధి సోకుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఈ టీకాలు వేయిస్తున్నట్లు చెప్పారు. వెటర్నరీ సర్జన్ డాక్టర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో గోవులకు టీకాలు వేస్తున్నారు.

ఓటు హకుపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: అర్హులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంఈఓలు ఆర్.స్వామి, ఎ. సుబ్రహ్మణ్యం కోరారు. జగ్గంపేటలో బుధవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఓటర్లపైనే ఆధారపడి ఉందన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టీవీఎస్ రంగా, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.